AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com
16-9-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు



2




2

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినికి మెడికల్ సీటు

## కాంగ్రెస్‌లో చేరిన మైనారిటీలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** భీమ్‌గల్ మండలం జాగిర్యాల్ తుర్గా ఖాశీ కాలనీ ప్రాంతానికి చెందిన వందమంది మైనారిటీలు మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, మానాల మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ ఐక్యంగా కృషి చేయాలని వారు సూచించారు. నూతనంగా చేరిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు.




## కళాభారతి ఆడిటోరియం పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్ భవేష్ మిశ్రా

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ స్థలంలో నిర్మిస్తున్న కళాభారతి ఆడిటోరియం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. బుధవారం ఆయన ఆడిటోరియం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ వేడుకల కోసం అధునాతన సదుపాయాలతో గ్రౌండ్ ఫ్లోర్ సహా ఐదు అంతస్తులతో నిర్మిస్తున్న భవన సముదాయం పనుల వివరాల గురించి ఆర్అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేదిక, రెండు బ్యాంకెట్ హాల్స్, సుమారు 1,400 మంది కూర్చునే సామర్థ్యంతో ఆడిటోరియం, ఆర్ట్ గ్యాలరీ పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఫ్రేమ్ వర్క్ పూర్తయినందున మిగతా పనులను కూడా వేగవంతంగా జరిపించాలని కలెక్టర్ సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం జిల్లా కేంద్రంలో సరైన వేదికలు లేనందున కళాభారతి ఆడిటోరియం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహ సముదాయాల నిర్మాణాల కోసం ఎంపిక చేసిన స్థలాలను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం పరిశీలించారు. గుండారం గ్రామంతో పాటు, నాగారం నందిగుట్ట ప్రాంతాల్లోని స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ ప్రవీణ్, రెవెన్యూ శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వైద్యం ముసుగులో పెద్ద దందా నడుస్తోంది. పల్లెల్లో ప్రజలకు అందుబాటులో ఉండే ఆర్ఎంపీ, పీఎంపీలే ఈ దందాకు కీలకంగా మారారు. చిన్న జ్వరం, తలనొప్పి, చిన్న గాయాలతో వారి వద్దకు వెళ్లే పేషంట్లను భయపెట్టి కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఆ రిఫరల్ వెనుక భారీ కమీషన్ వ్యవహారం నడుస్తోంది.

– అక్షరటుడే, కామారెడ్డి




# ఆస్పత్రుల్లో కమీషన్ దందా

■ కీలకంగా వ్యవహరిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు ■ రిఫర్ చేస్తే డబ్బులు ఇస్తున్న యాజమాన్యాలు ■ పట్టించుకోని వైద్యారోగ్య శాఖ అధికారులు

జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో, ప్రధాన గ్రామాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రైవేట్ ఆసుపత్రుల ఏజెంట్లు నెలవారీ టార్గెట్ ఇస్తున్నారు. ఒక పేషంట్‌ను పంపితే 30 శాతం వరకు కమీషన్ ముడుతోందని విశ్వసనీయ సమాచారం. ఉదాహరణకు పేషంట్ బిల్లు రూ.50 వేలు అయితే అందులో రూ.15 వేలు నేరుగా రిఫర్ చేసిన ఆర్ఎంపీకి వెళ్తుంది. కొన్ని ఆసుపత్రులైతే అడ్వాన్స్‌గా నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో సాధారణ మందులతో తగ్గే జబ్బులకు కూడా స్కానింగ్‌లు, ఆపరేషన్లు అవసరం అంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

### వైద్యం ముసుగులో వ్యాపారం

కామారెడ్డి పట్టణంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి, దోమకొండ ప్రాంతాల్లో ఈ దందా మరింత ఎక్కువగా ఉందని తెలుస్తోంది. పట్టణంలోని 10కి పైగా ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రులు ఈ విధంగా ఆర్ఎంపీల నెట్ వర్క్‌ను నడుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రతి ఆసుపత్రికి 20 నుంచి 50 మంది ఆర్ఎంపీల నెట్ వర్క్ ఉందని, వారికి ప్రత్యేక కోడ్ నంబర్లు, విజిటింగ్ కార్డులు కూడా ఇచ్చారని తెలుస్తోంది. దీంతో ఆర్ఎంపీలు లక్షాధికారులు అవుతుండగా, పేద ప్రజలు మాత్రం ఉన్న ఆస్తులు అమ్ముకునే పరిస్థితి వస్తోంది. ఈ తతంగం అంతా వైద్యారోగ్య శాఖ అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదు.

### పేషంట్ బిల్లు నుంచే కమీషన్

ఈ మొత్తం కమీషన్ భారం చివరికి పేషంట్ పైనే పడుతోంది. ఆసుపత్రి యాజమాన్యాలు తమ జేబు నుంచి ఇవ్వడం లేదు. పేషంట్ బిల్లులోనే అదనంగా 30 నుంచి 40 శాతం కలిపి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ.5 వేలతో అయ్యే పరీక్షకు రూ.8 వేలు, రూ.30 వేలతో అయ్యే డెలివరీకి రూ.50 వేలు ఇలా బిల్లులు పెంచేస్తున్నారు. రోగం తగ్గిన తర్వాత కూడా పేషంట్ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. కమీషన్ కోసం కొన్ని చోట్ల అవసరం లేకపోయినా ఆపరేషన్లు చేస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.



## నిమజ్జనానికి ముందే రూట్‌మ్యాప్‌ను క్లియర్ చేసుకోవాలి

**అక్షరటుడే,కామారెడ్డి :** గణేష్ నిమజ్జనానికి ముందే నిమజ్జన రూట్‌లో ఉన్న లోపాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను ఎస్పీ రాజేష్ చంద్రతో కలిసి పరిశీలించారు. ముందుగా రైల్వే స్టేషన్ ఎదురుగా పోలీసులు నెలకొల్పిన ట్రాఫిక్ గణపతిని దర్శించుకున్న తర్వాత అధికారులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, గణేష్ ఉత్సవ సమితుల ప్రతినిధులతో కలిసి ప్రత్యేక బస్సులో నిమజ్జన రూట్‌ను పరిశీలించారు. ఓల్డ్ బస్టాండ్, ఇందిరాగాంధీ చౌరస్తా నుంచి బాంబే క్లాత్, పాన్ చౌరస్తా, బడా మసీద్, రైల్వే ఫ్లైఓవర్, నిజాంసాగర్ చౌరస్తా, న్యూ బస్టాండ్ మీదుగా ముగింపు ప్రదేశమైన టేక్రియాల్ చెరువు, దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి వరకు రూట్‌ను స్వయంగా తిరిగి చూశారు. నిమజ్జన మార్గంలో ట్రాఫిక్, రహదారుల పరిస్థితి, విద్యుత్ లైన్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, బారికేడ్లు తదితర అంశాలను పరిశీలించి లోపాలను నిమజ్జనానికి ముందే పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన వేళ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు, రెస్క్యూ బృందాలు, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచుతామన్నారు. గణేష్ నవరాత్రులు పూర్తయ్యే వరకు సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా ఉంటుందన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా డీజేలకు స్వస్తి పలికి సాంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు జరుపుకోవాలని, నిబంధనల ప్రకారం డీజేలపై నిషేధం అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు.

## నేడు తెరుచుకోనున్న లింగంపేట అయ్యప్ప ఆలయం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి;** లింగంపేట మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం బుధవారం సాయంత్రం 5:30 గంటలకు తెరుచుకోనుంది. గురువారం ఉదయం 5:30 గంటల నుండి 5 రోజుల పాటు స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. శనివారం కుంకుమార్చన, ఆదివారంశ్రీ లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, సోమవారం సాయంత్రం 7 గంటలకు పడి పూజా మహోత్సవం నిర్వహిస్తారు. రేపటి నుంచి ఐదు రోజుల పాటు నిత్యం ఉదయం 7 గం.లకు గణపతి హోమం, 7-11 గంటల వరకు నెయ్యి అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన నిర్వహిస్తారు. అనంతరం 12:30 గంటలకు ఆలయం మూసివేసి, సాయంత్రం 5:30 గంటలకు తెరుస్తారు. సాయంత్రం 6:30 గంటలకు హారతి, 7:30 గం.లకు - పుష్పాభిషేకం, 8 గంటలకు మహా నివేదన చేపడుతారు.ఈ మాస పూజల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.




## పీసీసీ చీఫ్‌కు పరిపాలన అంటే ఏమిటో తెలియదు : ఎంపీ అర్వింద్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు పరిపాలన అంటే ఏమిటో తెలియదని ఎంపీ అర్వింద్ ఎద్దేవా చేశారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీసీ చీఫ్ నిజామాబాద్ నుంచి పోటీ చేయాలని తాము కోరుకుంటున్నామన్నారు.పరిపాలన అంటే ఏమిటో తెలియని ఆయన నిజామాబాద్ నుంచి పోటీ చేస్తే ఎలా ఉంటుందో తెలుస్తుందన్నారు. అలాగే కవితను చూస్తే తనకు జాలేస్తుందని ఎద్దేవా చేశారు. నా పేరులోనే ధర్మం ఉందని కవిత ఎద్దేవా చేసిందని.. మరి ఆమెను ప్రజలు ఓడించారని.. దానికి సమాధానం ఆమెనే చెప్పాలన్నారు. కవితను ఆమె కుటుంబ సభ్యులే వెళ్లగొట్టారని.. కవితను పట్టించుకునే వారే లేరన్నారు.

## అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** నడిపల్లి శివారు డిచ్‌పల్లి స్టేషన్‌లోని శ్రీ కాశీ విశ్వనాథ ఆలయ ఆవరణలో అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. గురుస్వామి ఉన్నికృష్ణన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పండితుడు రాజేంద్ర త్రిపాఠి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నడిపల్లి సర్పంచ్ కులాచారి అశ్విని, కాశీ విశ్వనాథ ఆలయ ఛైర్మన్ సాగర్ గుప్తా, మాజీ సర్పంచులు సతీష్, అంజయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంలో మీడియాదే కీలకపాత్ర

**అక్షరటుడే, కామారెడ్డి :** ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమైన పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీఐబీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వార్తలాప్' మీడియా వర్క్ షాప్‌లో ఆయన పాల్గొన్నారు. సామాజిక సంక్షేమం, ప్రజా భద్రతకు సంబంధించిన అంశాలను విస్తృత ప్రజానీకానికి చేరవేయడంలో సమర్థవంతమైన కమ్యూనికేషన్ ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం సైబర్ మోసాలు, నశా ముక్త్ భారత్, ఇతర అంశాలపై పీఐబీ ప్రతినిధులు సుదీర్ఘంగా వివరించారు. అదనపు కలెక్టర్ ఎన్‌వై గిరి, ఈగల్ ఫోర్స్ డీఎస్పీ సోమనాథం, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద్ రెడ్డి, సైంటిస్ట్ జగదీష్ బాబు పాల్గొన్నారు.





## డీజేలకు అనుమతి లేదు : సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** జిల్లా ప్రజలకు సీపీ సాయి చైతన్య పలు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ఏర్పాటు చేయొద్దని, జనరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను పెట్టొద్దన్నారు. ఎక్కువ సౌండ్ వచ్చే డీజేలను ఏర్పాటు చేయొద్దన్నారు. డీజేలతో దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేధం ఉందని చెప్పారు. ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని ఉత్పత్తి చేసే డీజేలు. సౌండ్ సిస్టంలు నిజామాబాద్ కమిషనరేటు పరిధిలో నిషేధించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 500 మందితో కూడిన సమావేశాలు, సభలు నిర్వహించాలని భావిస్తే అనుమతి తప్పనిసరి అని సీపీ పేర్కొన్నారు. మాల్స్, సినిమా థియేటర్స్, హోటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద సెక్యూరిటీ నిబంధనలు తప్పనిసరి పాటించాలన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా చర్యలు : కలెక్టర్




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** వానాకాలం సీజన్ ధాన్యం సేకరణకు, సేకరించిన ధాన్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో, తహశీల్దార్లతో ధాన్యం సేకరణ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈసారి జిల్లాలో 4.35 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారని, 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. ఇందులో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించామని పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లాలో 736 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. యాసంగిలో 660 కేంద్రాలు కొనసాగగా, ఈసారి అదనంగా 76 కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోనే మొదటగా జిల్లాలో ధాన్యం దిగుబడులు చేతికి అందనున్న దృష్ట్యా, అక్టోబర్ మొదటి వారం నుంచే కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి కొనుగోలు కేంద్రంలో తగిన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ధాన్యాన్ని ఈసారి రైస్ మిల్లులకు పంపే అవకాశం లేనందున జాగ్రత్తగా భద్రపర్చేందుకు అవసరమైన గిడ్డంగులు, అనువైన స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గిడ్డంగులతో పాటు మార్కెట్ కమిటీ గోడౌన్లు, ప్రైవేట్ గిడ్డంగులను ధాన్యం నిల్వ కోసం క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్‌వో గీత, ఆర్డీవోలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, డీఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, డీసీఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## బల్దియాలో పారిశుధ్య ఆటోల పంపిణీ



**అక్షరటుడే, కామారెడ్డి :** బల్దియాకు నూతనంగా వచ్చిన నాలుగు పారిశుధ్య ఆటోలను మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి ప్రారంభించి పంపిణీ చేశారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకే ఈ వాహనాలను తీసుకువచ్చినట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. 1,2 వార్డులకు కలిపి ఒకటి, 13, 45 వార్డులకు కలిపి ఒకటి, 38,39 వార్డులకు ఒకటి, 26,27,28 వార్డులకు కలిపి ఒక ఆటో చొప్పున కేటాయించారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయంలో వినాయక నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ ఉమారాణి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వినాయక చవితిని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. వైస్ ఛైర్‌పర్సన్ కాసర్ల గోదావరి, కమిషనర్ పర్వతాలు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిలో 20 అడుగుల భారీ మట్టి గణపతి




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణంలో హిందూ యువ సేన ఆధ్వర్యంలో 20 అడుగుల భారీ మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించారు. 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు.. మట్టి వినాయకుడే ముద్దు' అనే నినాదంతో ఏటా మట్టి విగ్రహాలనే పూజిస్తున్న నిర్వాహకులు, ఈసారి కామారెడ్డి జిల్లాలోనే ఎత్తైన మట్టి గణనాథుడిని ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ మా దుర్గా ఆర్ట్స్ కలకత్తా కళాకారుల సహకారంతో శివ తాండవ రూప గణనాథుడిని దాదాపు రెండు నెలల పాటు శ్రమించి తీర్చిదిద్దారు. మండపంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. రాహుల్, ఫణి, అఖిల్, గురు, వెంకట్, కిరణ్, అభిలాష్, అనిల్, సుజిత్, పురుషోత్తం, అభిషేక్, జాషువా, మోహన్, భైరవ, దయాకర్ పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే అనారోగ్యాలు దూరం..




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆరోగ్యమే మహాభాగ్యమని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చని స్త్రీ వైద్య నిపుణురాలు, కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అంకం భానుప్రియ అన్నారు. మాక్లూర్ మండలం మదన్ పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్, సరోజ్ దేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. భానుప్రియ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ పనికిరాదన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మంజుల, ధర్మేందర్ పటేల్, మదన్ పల్లి సర్పంచ్ రాస లావణ్య, ఉప సర్పంచ్ రాస మహేష్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్ష కార్యదర్శులు పి.రాఘవేంద్ర బాబు, చింతల గంగాదాస్, ప్రోగ్రామ్ ఛైర్మన్ ఇరుమల శివలింగం పాల్గొన్నారు.





## బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు

**ఉమ్మడి జిల్లాలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతన్నాయి. వివిధ రూపాల్లో కొలువైన గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మండపాల్లో స్వామివారిని భక్తులు దర్శించుకుంటున్నారు. పలు చోట్ల అన్నదానాలు, కుంకుమార్చనలు చేస్తున్నారు. రాత్రి సమయంలో మండపాల్లో భజన చేస్తున్నారు.**

– అక్షరటుడే, నెట్‌వర్క్

## ఇంజినీర్లకు సన్మానం




**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ మండలం కిసాన్ నగర్‌లోని లయన్స్ భవనంలో బుధవారం ఇంజనీర్స్ డే నిర్వహించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద కాలువకు చెందిన ఇద్దరు సహాయ ఇంజనీర్లు కొండా వంశీ, పవన్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ రామరాజు గౌడ్, ఉప సర్పంచ్ స్వామి, లయన్స్ క్లబ్ రీజినల్ ఛైర్మన్ జ్ఞాన సాగర్ రెడ్డి, కార్యదర్శి చాకు లింగం, ఇంజినీర్లు గణేష్, సురేష్, లయన్స్ క్లబ్ సభ్యులు వంశీ రెడ్డి, రమాకాంత్, మల్లయ్య పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికులకు సన్మానం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో జేసీఐ ఇందూర్ ఆద్వర్యంలో కోటగల్లీలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. జేసీఐ ఇందూర్ అధ్యక్షుడు జైపాల్ కాలె మాట్లాడుతూ జేసీఐ వారోత్సవాల్లో భాగంగా సైలెంట్ స్టార్స్ డే నిర్వహించామన్నారు. అందులో భాగంగా నిత్యం నిజామాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న ముగ్గురు మున్సిపల్ కార్మికులను సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఐ ఇందూర్ పూర్వాధ్యక్షుడు కోటగిరి చంద్రశేఖర్, చింతల గంగాదాస్, కార్యదర్శి తేజస్వి, కోశాధికారి నాగేందర్, కావ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినికి మెడికల్ సీటు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బైపీసీ చదివిన విద్యార్థిని మదీహ షేవార్‌కు నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు లభించింది. 2024-26లో నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బైపీసీ చదివిన మదీహ షేవార్ ప్రతిభావంతురాలని కళాశాల ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజ్ అన్నారు. తమ కళాశాల నుండి నీట్ పరీక్షకు హాజరైన మదీహ రాష్ట్ర స్థాయిలో 2,959 ర్యాంక్ సాధించిందని, జాతీయ స్థాయిలో 1,57,807 ర్యాంక్ సాధించిందని ప్రిన్సిపల్ తెలియజేశారు. మదీహను ఆదర్శంగా తీసుకొని కళాశాల విద్యార్థినులు బాగా చదువుతూ మంచి ర్యాంకులు సాధించి భవిష్యత్తులో స్థిరపడాలని ఉద్బోధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం తరపున మదీహ షేవార్‌ను శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. భవిష్యత్‌లో మంచి డాక్టర్‌గా వచ్చి నిజామాబాద్ ప్రజలకు వైద్య సేవలను అందించాలని ప్రిన్సిపల్ గంధం బుద్ధిరాజ్ ఆకాంక్షించారు. విద్యార్థిని మదీహ షేవార్ మాట్లాడుతూ తన అభ్యున్నతికి కృషి చేసిన ప్రిన్సిపాల్‌కు, అధ్యాపక బృందం మంజులవాని, మురళి, అర్చన, అర్చనకు కృతజ్ఞతలు తెలిపారు. తనను ప్రోత్సహించిన అధ్యాపకులు మహమ్మద్ ఫరీస్ ఉద్దీన్, షాజీయా బాదర్, అనిస్ ఫాతిమా, సురయా ఆఫ్రిన్, ఫహీం ఉద్దీన్‌కులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు నర్సయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షూస్, యూనిఫాంల అందజేత



**అక్షర టుడే,నందిపేట్:** బజార్ కొత్తూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూస్, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపుముత్యం మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ తరపున ఎల్లప్పుడు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వార్డ్ సభ్యులు, పాఠశాలకు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**అక్షరటుడే, భీమ్‌గల్ :** బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ భీమ్‌గల్ మండల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ షఫీ నూతన కార్యవర్గ సభ్యులను బుధవారం ఘనంగా సన్మానించారు. మండల నూతన అధ్యక్షుడిగా నూర్ ఉల్ హుదా స్కూల్‌కు చెందిన ఖదీమ్ ఇక్బాల్, కార్యదర్శిగా గ్లోబల్ స్కూల్ హరీష్, కోశాధికారిగా డెక్కన్ స్కూల్ రిజ్వాన్ ఉద్దీన్ నియమితులయ్యారు. సభ్యులు మాట్లాడుతూ మండలంలోని బడ్జెట్ పాఠశాలల సంక్షేమం, అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు.

## బాల్కొండలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



**అక్షరటుడే, బాల్కొండ:** టీపీసీసీ చీఫ్‌గా బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్లు పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా బాల్కొండ నియోజకవర్గంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్, డీసీసీ మాజీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి కేక్ కటింగ్ చేసి మహేష్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ పట్టణ అధ్యక్షుడు పరస అనంతరావు, మాజీ మండల అధ్యక్షుడు బోదిరే స్వామి, మాజీ పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్న సురేందర్, ఆరేపల్లి నాగేంద్ర బాబు, గున్నల వెంకటేష్ గౌడ్, బంగ్లా దేవేందర్, సుంకరి సురేష్, గట్టు మురారి, మేకల శీను, అనిల్ గౌడ్, పఠాని జేమ్స్, నరేందర్, శీను రవి, రాజేశ్వర్, కల్పన, గంగమణి, ఎంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నందిపేట్ భారత పెట్రోల్ బంక్‌లో సీఎన్‌జీ సేవలు ప్రారంభం



**అక్షరటుడే, నందిపేట్:** మండల కేంద్రంలో భారత్ పెట్రోల్ బంక్‌లో సీఎన్‌జీ సేవలను ప్రారంభించారు. ప్రత్యేక పూజలు అనంతరం ముఖ్య అతిథులు భారత పెట్రోలియం సీఎన్జీ మేనేజర్ హితీష్ కుమార్ చేతుల మీదుగా సీఎన్జీ ఫిల్లింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సీఎన్జీ వినియోగం వాహనదారులకు ఆర్థికంగా ప్రయోజనకరమని తెలిపారు. సీఎన్జీ వాడకం వల్ల కాలుష్యం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు వాహనదారులు ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో భారత పెట్రోలియం సేల్స్ ఆఫీసర్ కార్తీక్, పెట్రోలియం బంక్ యాజమాన్యం, ప్రజా ప్రతినిధులు, వ్యాపారవేత్తలు స్థానికులు పాల్గొన్నారు.

## చేయూత పింఛన్ల దరఖాస్తుల పరిశీలన

**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని వివిధ వార్డుల నుంచి నూతనంగా చేయూత పథకం కింద పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ డి. గజానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వార్డుల్లో జరుగుతున్న క్షేత్రస్థాయి పరిశీలనను స్వయంగా తనిఖీ చేసి, వెరిఫికేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. అర్హత కలిగిన ప్రతిఒక్క లబ్ధిదారుడి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**అక్షరటుడే,భీమ్‌గల్ :** మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన దుమాల లింబన్న భార్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాగా గ్రామానికి చెందిన ఛాలెంజ్ యూత్ అసోసియేషన్ సభ్యులు బాధిత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు ఆమె మృతి చెందడం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబానికి తమ వంతుగా ఈ చిన్నపాటి సాయం అందించామని తెలిపారు. యువత ఎల్లప్పుడూ సమాజ సేవలో, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందుంటుందని పేర్కొన్నారు. లింబన్న కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## బాన్సువాడలో హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం



**అక్షరటుడే, బాన్సువాడ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్, భారత రాజ్యాంగంపై హమారా ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బాన్సువాడ డివిజన్ దళిత సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బాన్సువాడ డివిజన్ అంబేద్కర్ సంఘం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించి హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ..అంబేద్కర్‌ను కించపరిచేలా పుస్తకం రాసి, ఈనెల 18న విడుదల చేస్తానని ప్రకటించినట్లు పేర్కొన్నారు. అటువంటి ప్రచురణల వల్ల ప్రజల మనోభావాలు దెబ్బతిని, కులాలు, మతాల మధ్య విద్వేషాలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు నక్క విజయ్, డివిజన్ అధ్యక్షుడు దేశాయ్‌పేట్ ప్రశాంత్, కౌన్సిలర్ దొనకంటి వెంకటేష్, బంగారు సాయిలు, కాదెపురం గంగారాం, బంగారు మైసయ్య, సంధుల గంగారాం, రవీందర్, రుశేగం భూమయ్య, బండి విజయ్, మల్లూరు సాయిలు, మన్నె చిన్న సాయిలు, ఆర్టీసీ మారుతి, సంబాపూర్ రవి, దేశాయ్‌పేట్ గంగాధర్, డాక్టర్ సాయిలు, పరుశురాం, ఆంజనేయులు, హరిప్రసాద్, మీర్జాపూర్ శ్రీను, పోశెట్టి, మామిడి భూమయ్య, బుడ్మి గంగారాం, కమ్మరి నర్సింలు పాల్గొన్నారు.